# అల్పసంతోషి ఆచార్లు

[కథానిక]

✽

= శ్రీ కపిల వెంకటరావు =

అతని పేరు అద్దంకి తిరుమల వైనతేయ వాహనాచార్యులు. అంత పేరూ నేను అనలేక ఊరికే 'ఆచార్లూ' అంటాను. ఆచార్లుని నేను మొట్టమొదట చూచింది మాచెర్లలో. మొన్నటి శివరాత్రికి సరీగా పదహారేళ్లు పూర్తి అయినవన్నమాట. నేను తలవని తలంపుగా ఎత్తిపోతల వెళ్లడం తటస్థించింది. శివరాత్రి స్నానం అక్కడ పూర్తి చేసి, గబగబ తిరిగివచ్చి రైలెక్కవలె ననుకుంటే—నేను రైల్వేస్టేషనురోడ్డుమీదికి రావడ మేమిటి, రైలు బయలుదేరిపోవడ మేమిటి రెండూ ఒక్కమారే జరిగినవి. కాబట్టి నేను ఉసూరుమంటూ వెనకకు వస్తుండగా డిప్యూటీ తహశ్శీలుదారు కచ్చేరీ దగ్గర కనిపించాడు ఆచార్లు. పూర్తిగా ఖద్దరు కట్టిఉన్నాడు. విప్పిన ఖద్దరుగుడ్డల మూటప్రక్కగా ఒక కూలివాడు నిలబడి ఉన్నాడు. ఎదురుగా నిల్చుని చూస్తూ ఉన్న అయిదారుగురితో ఆచార్లు ఖద్దరుయొక్క ప్రాశస్త్యమువిషయమై వివరిస్తున్నాడు. "ఇదుగో చూచారా, మనం ఖద్దరు కట్టకపోతే స్వరాజ్యం రాదు. స్వరాజ్యం రాకపోతే మనకి బానిసవృత్తి తప్పదు. బానిసలమై బ్రతికేకన్న చావడం మంచిది. ఆంధ్ర సోదరులారా, ఊరికే చావడం ఎందుకు? కనుక ఖద్దరు కొనండి." అని ప్రబోధిస్తుంటే ఆ మాటలకు అడ్డంవచ్చి ఒక కోమటి బిడ్డ నోట్లో బీడీ తీసి "శివరాత్రి మరణం సిద్ధించడం మాటలా" అన్నాడు. ఆచార్లు వెంటనే అందుకొని "ఆ పనికి వైకుంఠ ఏకాదశి ఉత్తమంగాని శివరాత్రి కాదని మా మతం. అయితే యేం లెండి, మన మన మతాలతో పని యేముంది? అవి మనని స్వరాజ్యం విషయంలో బాధించకూడదు. కనుక తమరు ఖద్దరు—" అని బదులుచెప్పగా నాకు చాలా సంతోషం కలిగింది. "ఆచార్ల పాటి ఆలోచన మనలో యెంతమందికి ఉంది? నిజంగా మన మతం స్వరాజ్యప్రయత్నానికి అడ్డం రాకూడదుకదా" అనుకుంటూ ముందుకుపోయి ఒక ఖద్దరు కండువా కొన్నాను. మంచిరకం కండువాయే అది. ఇప్పటిదాకా మన్నేదే గాని మా బావమరది ఎప్పుడూ అదే వాడి చింపి ముక్కలుచేశాడు.

ఆ రోజుకి ఇక బేరం చాలునను కున్నాడో యేమిటో ఆచార్లు కూలివాడిచేత గుడ్డలు మూటకట్టించివేసి నాతోవచ్చాడు. నాకు విడిదికి సత్రం చూపించి, భోజనం ఏర్పాటూ అదీ చేయించాడు. ఉభయులమూ మధ్యాహ్నం బస్సునెక్కి సాయంకాలానికి గురిజాల చేరాము. నేను నేరుగా నర్సారావుపేట వెళ్లిపోయినాను. అతడు గురిజా

లలో ఆగిపోయినాడు. అది తన హెడ్ క్వార్టర్సుట.

ఆ రోజున మేము కలిసిఉన్నంత సేపూ యేదో ఒకసంగతి మాట్లాడుతూనేఉన్నాడు. వాళ్లది స్వస్థానం బందరుదగ్గర మంగినపూడి అని చెప్పారు. కొద్దిపాటి యింగ్లీషూ, కొద్దిగా తెలుగూ నేర్చుకున్నాడట. కలరా తగిలి తల్లీ, తండ్రీ ఒక్కరోజునే కాలం చేశారట. వాళ్లకు తా నొక్కడే సంతానమట. ఆ యిల్లు పాడుపెట్టి చదువని కొన్నాళ్లూ, సంపాదనని కొన్నాళ్లూ తిరుగుతూ యెక్కడెక్కడో యేవేవో వృత్తులుచేసి, ఖద్దరు విక్రయం మొదలుపెట్టాడు. స్వశక్తిపైని ఆధారపడుతూ, దేశం తిరిగిన యీ మానవుడింత అమాయకు డేమిరా అనిపించింది నాకు. “ఖద్దరు విక్రయం చేయను వచ్చి వచ్చి పల్నాటికి వచ్చావేమిటి ఆచార్లూ, సూదులమ్మడానికి కమ్మరవీథికి వెళ్లినట్టుగాను? ఈ ప్రజలు ఖద్దరు తప్ప మరొకటి వాడకమే లేదు గదా. ఇక్కడ నీ కేమిబేరం తగులుతుందని?” అన్నాను.

“ఆ సంగతి నాకు మొదటిలో తెలియలేదు పంతులుగారూ. అంతా ఖద్దరు కట్టడం చూచి, ఇక్కడ మంచి బేరం ఉంటుందనుకొని వచ్చాను. పొరబాటే. అయినా రోజుకి ఒక్క శాల్తీ అమ్మితేచాలు. నాకు పొట్ట గడుస్తుంది. ఒక్క ప్రాణం గదండీ. అదీ వండుకుని తినడం. పంచభక్ష్య పరమాన్నాలు మన కెప్పుడూ అవసరంలేదు.” అని కొంచెం వెకిలిగా నవ్వి, “ఒక్కొక్క రోజుని ఒక్క శాల్తీకూడా ఖర్చుకాదు పంతులుగారూ. కాని ఒక్క బైసికిలుంటే, ఎంత పనైనా చేసేవాడిని.” అన్నాడుఆచార్లు.

“బైసికిలు నిన్ను ఎల్లా రక్షిస్తుం”దని ప్రశ్నించాను.

“ఈచుట్టుప్రక్కల పది పన్నెండు గ్రామాలు ఒక్కరోజున ప్రదక్షిణంచేసి చక్కావస్తాను. బేరం జోరుగా సాగుతుంది.” అని అతను జవాబుచెప్పగా నాకు కోపంవచ్చింది. నేను గట్టిగా మందలించాను: “చెప్పినా అర్థంచేసుకో వేమిటి? ఇక్కడ కావలసినంత ఖద్దరు ఇక్కడ సప్లయి కావడమే కాకుండా అదనంగా కూడా తయారవుతుందోయ్. ఇక్కడి సరకు పట్టుకు వెళ్లి ఇతరప్రదేశాలలో అమ్ముతారు. ఖద్దరు ప్రచారం ఇక్కడ అవసరంలేదు గనుకనే కాంగ్రెసువారు ఇక్కడ తమతరఫున షాపు పెట్టలేదు. అటువంటి చోట ఖద్దరు అమ్మడమంత పిచ్చిపని మరొకటి లేదని చెబుతుంటే, బైసికిలంటా వేమిటి, బైసికిలు” అని.

“చిత్తం, చిత్తం. అర్థమైంది, అర్థమయింది” ఇక్కడ ఉపయోగంకోసమే కాదులెండి, అసలు మనకి మొదటినుంచీ బైసికిలంటే అదొక యిది. తమ యిలాకాను ఎక్కడైనా పాతికముప్ఫై రూపాయిలకు ఒక్క నడిపాతబైసికి లుంటే, నాపేర వ్రాయించెయ్యండి. నా హెడ్ క్వార్టర్సు గురిజాల” అని అతడు అంటూఉండగా బస్సు కదిలింది. “సెలవు, పంతులుగారూ” అని ప్రక్కఊచ పట్టుకుని నాలుగడుగులు పరుగెత్తివచ్చి ఆచార్లు దిగబడిపోయినాడు.

అయిదారుసంవత్సరాలు గడచినవి. నేను ఒకసారి నడివేసవికాలంలో అమలాపురం వెళ్లవలసివచ్చింది. రాజమండ్రిలో నావ యెక్కి వెళ్లి బొబ్బర్లంకలో లాంచి యెక్కవలసివచ్చింది. లాంచి రాజవరం,

పేరవరం గ్రామాలు దాటినప్పటినుంచీ ఎండ వేడికి తట్టుకోవడము కష్టమైపోయింది. తలనొప్పి పెట్టింది. ఒక్కక్షణం యే రేవులోనో లాంచి ఆగింది. గట్టుమీద జనం ఒక చిన్న గుంపుగా చేరిఉన్నారు. గుంపుమధ్యను ఒక ఆసామీ మందులమ్ముతున్నాడు. నాకు తలనొప్పి మరీ యెక్కువై, తలనొప్పిమందు ఉన్నదేమో కనుక్కోవలసిందని ఒక కుర్రవాడిని కోరాను. ఆకుర్రవాడు గుంపులోకి దూరి మందులమ్మే అతనిని తలనొప్పిమందు కొరకు అడిగాడు. "ఆ, ఉంది. అమ్మకానికి లేదుగాని, మనం స్వయంగా వేస్తాం ఆ మందు. ఎవరికి తలనొప్పి" అని అతడు జబాబు చెప్పాడు. "రైళ్లల్లో తిరిగి అమ్మువాడుకాబోలు, విన్నకంఠంలా గుంది" అనుకుంటున్నాను నేను. "ఎవరికి సార్ తలనొప్పి" అంటూ ఆ మందులఆసామీ లాంచిలోకి వచ్చాడు. అతడు మిల్లుబట్టలు కట్టుకున్నాడు. పంచె, చొక్కా, ఒక వేస్టుకోటు, గాంధీటోపీ-ఇదీ వేషం. నన్ను ఒక్కక్షణం నిదానించిచూచి, మందులపెట్టె క్రింద పెట్టి "నమస్కారం పంతులుగారూ, నేను—" అని తన యింటిపేరూ, స్వంతపేరూ అంతా చెప్పాడు. నాకు వెంటనే గుర్తువచ్చింది. "ఖద్దరువర్తకం మానేశావా?" అని అడిగాను. "తమ ఆజ్ఞప్రకారం అల్లాగే మానేశాను. కుమ్మరివీథిని కుండలమ్మినట్లు ఆ దిక్కుమాలిన దేశంలో నేను ఖద్దరమ్మడం ఏమిటండీ? తమ దర్శనమైన మూడురోజులకే మానేసి చక్కా వచ్చాను. తమరు అమలాపురమా అండి, నేనూ వస్తాను కొంత దూరం" అని, లాంచీవాళ్లు పరిచయస్థులు కాబోలు, టిక్కెట్టు కొనకుండానే లాంచిలో కూర్చున్నాడు. నాతలనొప్పి తగ్గడానికేదో మందు ఉపయోగించాడు. ఆకాశంమీద ఎక్కడినుంచో ఒక మబ్బు వచ్చి సూర్యుడిని కాసంత కప్పింది. వేడి తగ్గింది.

ఆచార్లు "పంతులుగారూ, తమర్ని నేను మరవలేను. ఆ శివరాత్రినాడు తమరు నాదగ్గర ఒక కండువా కొనడమేకాదు, ఆ రోజున తమరు నాకిచ్చిన సలహావల్ల నేను చాలా బాగుపడ్డాను. లేకపోతే నేను చెడిపోయిఉందును. ఇప్పుడు చూచారా. హాయిగా ఉంది నాపని. కొత్తపేట హెడ్ క్వార్టర్సు. చుట్టుప్రక్కల సర్కీటు. మందులమ్మగా వచ్చినదాంట్లో ఖర్చులు పోగా చెరిసగం. జీవనం జరిగిపోతూంది" అన్నాడు.

"చెరిసగ మంటున్నావు, రెండవవారెవరు?" అన్నాను.

ఆచార్లు ఇటూ అటూ చూచాడు. నాచెవిదగ్గర చేరి, నిమ్మళంగా "అదే రహస్యం. తమతో గనక మనవిచేస్తాను. మావాడే ఒకడు ఒక పరమహంసక్రియ సంపాదించాడు. వాడు యోగాభ్యాసం అదీ చేస్తూ, కొన్నాళ్లు మలయాళం అదీ తిరిగివచ్చాడు. వాడు తయారుచేసే తైలమిది. ఇది ఉపయోగిస్తే, చెప్పారూ! రోజూ ఒక డజనుబుడ్లు అమ్ముడైపోతున్నాయి. అది ముఖ్యవృత్తి అనుకోండి. ఇది ఒక్కటే అమ్మితే బాగుండదని కొన్ని చిన్నచిన్న మందులు-ముఖ్యంగా హోమోపతీవి తెచ్చి అవికూడా అమ్ముతున్నాను. ఈప్రాంతం జనం అందరికీ మనమంటే మంచి గౌరవం. బాగా జరిగిపోతూంది లెండి. కాని ఒక్క బైసికిలుంటే బాగుండును. చుట్టుప్రక్కల గ్రామాలన్నీ తిరిగేసి

రోజూ నూరుబుడ్లు అమ్మేవాడిని” అని చెప్పాడు. లాంచి కదిలింది. కాస్త గాలికూడా తిరిగింది. ఆమాటా ఈమాటా ఆడుతూ అతను ఒక క్రోసు క్రోసున్నర వచ్చాడు. మాటల సందర్భంలో ఒక అభిప్రాయం బయటపెట్టాడు. అదేదనగా ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రం లేకపోవడంవల్ల ఆంధ్రులకి చాలా నష్టమని. తన అభిప్రాయానికి చాలా కారణాలు ఉన్నవని చెప్పాడు. “నేను మాత్రం తెలుగువాడిని కానా యేమిటి, అంత కారణాలు చెప్పవలసిన పనేమిటి” అంటూ నేను వారించినా వినక అతను తనకు కలిగిన బాధ యేదో చెప్పాడు. బెంగాలులోని ఎవరో కవిరాజుగారి తాలూకు మందులు కొత్తపేటలో అమ్మడానికి కమిషనుమీద యేజన్సీకోసం తాను ప్రయత్నిస్తే, అంతా సిద్ధమయినతర్వాత ఆ ఏజన్సీ ఒక అరవవాడి కిచ్చారట. “ఆంధ్రరాష్ట్రం వస్తే ముందు మనకి రావలసినవి ఈ యేజన్సీలటోయి?” అని నే నంటే “అవునండీ” అన్నాడు. దిగి వెళ్లిపోతూ “పంతులుగారూ, మరచిపోవద్దు, ఒక్క నడిపాతబైసికిలు పదిహేను, యిరవైరూపాయిలలో—” అని కేక వేశాడు. అంతలో మా లాంచి కాలువలో మలుపుతిరిగింది.

ఆమధ్యను చెన్నపట్నం వెళ్లి తిరిగి వస్తున్నాను. సెంట్రలు స్టేషనులో బయలుదేరిన మెయిలు సూళ్లూరుపేటలో ఆగింది. ‘చల్లా, చల్లా’ అని ఒక గొల్లమనిషి కేకలేస్తున్నది. ఒకడు జీడిపప్పుపొట్లాలు అమ్ముతున్నాడు. తెలుగులో అప్పట్లో అమలులో ఉన్న దినవారపక్షమాసపత్రికల పేర్లు చెప్పుకుంటూ వస్తున్నాడొకాయన. ఆయన వదలులాగు తొడుక్కున్నాడు. పొడుగులాల్చీ తొడిగాడు. మెడచుట్టూ ఒక తువ్వాలు ఉన్నది; కళ్ళ కొక జోడుకూడా ఉన్నది. ఆ పత్రికల పేర్లన్నీ వల్లిస్తూ, “కావాలాండి సార్” అని బండిలోకి తొంగిచూచి నన్ను ప్రశ్నించాడు. అంతలోనే “నమస్కారం పంతులుగారూ, నేను ఆచార్లుని. పట్నం వెళ్లివస్తున్నారా?” అంటూ బండితలుపు తెరచుకొని లోపలకు వచ్చాడు.

“ఈదేశంలో యేం జేస్తున్నావోయ్? నిమ్మళంగా ఉన్నావా” అని అడిగాను నేను.

“తెలుగుపత్రికల యేజన్సీ పంతులుగారూ, దివ్యంగా ఉందనుకోండి మనపని. పొట్ట జరిగిపోతూంది” అని, వెంటనే “ఆంధ్రరాష్ట్రంమాట యేమిటంటారు?” అన్నాడు.

నాకు నవ్వువచ్చింది. “ఆంధ్రరాష్ట్రం మాట యిప్పుడెందుకు” అన్నాను.

“కాదులెండి, తమరిమాటంటే నాకు చాలా గురి పంతులుగారూ, తమ అభిప్రాయం తెలుసుకోవాలని. మన రాష్ట్రానికి రాజగోపాలాచారి అడ్డం తగులుతున్నాడట, నిజమేనా” అన్నాడు.

నేను కొంచెం గట్టిగానే చెప్పాను. “ఇన్నికోట్ల ఆంధ్రులనీ రాజగోపాలాచారి ఎంతవాడయ్యా అడ్డడానికి? ఒరిస్సారాజ్యం ఇప్పించింది ఆయనేనా? మనల్ని ఏలేవాళ్లు వేరు. మనవాళ్లు వెలిగిస్తున్న ప్రభుత్వం ముచ్చట మూన్నాళ్లు కాలేదు. అప్పుడే ఆచారి అడ్డం, కన్నడులకి సాహేబడ్డం అంటూ మాట్లాడతారేమిటోయ్? ఇవ్వదలచుకొని యింగ్లీషువాడు ఇవ్వాలి. వాడు ఇస్తే రాజగోపాలాచారి అడ్డగలడా ఆంధ్ర

రాష్ట్రం? ఏమిమాట, ఆచార్లూ" అన్నాను. ఆచార్లుముఖ మింత అయింది. ఆప్యాయంగా నాచేతులు పట్టుకుని "నేనూ అల్లాగే అనుకుంటున్నాను లెండి. వైష్ణవుడని అభిమానం కాదుసుమండీ. తమరు నాస్వభావం బాగా ఎరుగుదురు. రాజాజీ విషయం మీరు చెప్పిన మాట నాకు నచ్చింది. అయితే మనకు ప్రత్యేక రాష్ట్రం ఎప్పుడు వస్తుందంటారు?" అన్నాడు. ఇంతలో రైలు కూతవేసింది. "రైలువాళ్ళకి మనమంటే ప్రాణం. గూడూరు దాకా వస్తాను. పాసెంజరులో వచ్చేస్తాను" అని నాతో వచ్చేశాడు. దారిలో చెప్పాను అతనికి. "తెలుగుపత్రికల వ్యాపారం అరవదేశంలో పెట్టావు. నీ వేమి సంపాదిస్తావు" అని కోపపడ్డాను. అది అరవదేశం కాదని వాదించాడు నాతో చాలాసేపు. చల్ల అమ్మే గొల్లమనిషి తెలుగు మాట్లాడలేదా అని సవాలుచేశాడు. కొద్దిగా చిన్నపోయినట్లు కనబడితే, నేను మళ్లీ అతనిని కాస్త హెచ్చరించాను. గూడూరికి బాగా యివతల ఉన్న స్టేషను ఒకదానిలో సిగ్నలందక మెయిలాగిపోయింది. "నేను సెలవుతీసుకుంటాను, పంతులుగారూ" అని దిగి వెళ్లిపోతూ, ఆచార్లు, ఒక్క క్షణ మాగి, "నామనవి మన్నించారు కారు తమరు" అన్నాడు.

'ఏమిట'న్నాను నేను.

"వెనక మనవిచేశాను. ఒక్క పాత బైసికిలు, కొద్దిపాటిధరలో కనబడితే మనకి కార్డు వ్రాయించాలి. మనకి సర్కీటు లేదిప్పుడు. ఎప్పుడూ హెడ్ క్వార్టర్సే. సూళ్లూరుపేట" అన్నాడు. రైలు కదిలింది.

గతించిన ఫిబ్రవరినెల చివర నేను బెజవాడనుంచి చల్లపల్లిమీదుగా బందరు వెళ్లవలసివచ్చింది. ఒకరియొక్క కారుమీద వారి సౌజన్యం మూలాన్ని ప్రయాణం చేశాను. వారికి చల్లపల్లిలో పని ఉండడం చేత ఆ ఊరుమీదుగా వెళ్లడము సంభవించింది. ఆ ఊరు వెళ్లినతర్వాత నా స్నేహితుడు తన వ్యవహారము చూచుకొంటుండగా నేను తోచక ఇటూ అటూ షికారు తిరిగాను. శ్రీ విశ్వేశ్వరస్వామివారి ఆలయమని ఎవరో చెప్పగా ఆ ఆలయం ఆవరణలోకి వెళ్లి, చెరువువైపు వెళ్లి కొంతసేపూ, మూల ఉన్న బురుజులెక్కి కొంతసేపూ కాలయాపన చేసి బయటికి వస్తున్నాను. బయటనుంచి చేతులో ఇన్ని అరటిపళ్లు పట్టుకొని గుడిలోపలికి వస్తున్నాడు ఆచార్లు. ఒక అంగవస్త్రం కట్టుకున్నాడు. ఒక అంగవస్త్రం నెత్తిమీద వేసుకున్నాడు. ఎండలోనుంచి వస్తున్నాడేమో నన్ను గుర్తించలేదు. నేనే "ఏమిటోయ్, నాకు శకునం రావడం ఒకటి, నువ్వు శివాలయప్రవేశం ఒకటి- ఈ రెండు నేరాలకీ ఏమిటి సమాధానం చెబుతావు" అన్నాను.

ఆచార్లు ఆగిపోయి, నమస్కరించాడు. "పంతులుగారా? క్షమించండి. ఎండవల్ల గుర్తించలేకపోయినాను. వెధవ యెండలు అప్పుడే ఎల్లా ఉన్నాయో చూచారా? ఎక్కడినుంచి దయచేస్తున్నారు? ఇక్కడికే దయచేశారా?" అన్నారు. తన చరిత్ర కూడా చెప్పాడు. సూళ్లూరుపేట తర్వాత యే యే పనులో చేసి తుదకు చల్లపల్లి చేరాడట. ప్రస్తుతవృత్తి పిల్లలకు ఇళ్లవద్ద పాఠాలు చెప్పడము.

"పొట్టకు లోపం లేదు లెండి" అని, "వెధవది. ఈ చుట్టుప్రక్కల రెండు మూడు

గ్రామాలలో పిల్లలకు చక్కగా ప్రైవేటు చెప్పే మాస్టరే లేడండి. మనని రమ్మని మరీ మరీ అడుగుతున్నారు. వెడితే, ఇక్కడివాళ్లు ఒప్పుకోరు. వీళ్లకి మనమంటే గురుస్థానం. వెళ్లి రావడం కూడా కష్టమే లెండి. ఇంతకూ ఒక్క బైసికిలుంటే, మూడు నాలుగు ఊళ్లూ చుట్టేసి వచ్చేసేవాడిని. ఇంతకూ ప్రాప్తం ఉండాలి లెండి. ఎప్పటికైనా కొనేతీరుతాను. తప్పదు. ఈ ఘటానికి వాహనయోగం ఉండితీరిందని చెప్పారు శఠగోపాచార్లుగారు." అన్నాడు.

ఆచార్లుతలమీద అక్కడక్కడ నెరుపు కనబడింది. వెనకటి దేహపాటవం కూడా లేనట్లున్నది.

వ్యవహారము సాంతమైనది కాబోలు, కారుడ్రైవరు నాకోసము హారన్ మోగించాడు. నేను కదలి వెడుతుంటే, ఆచార్లు నాతో కూడా కారువరకు వచ్చి నిలబడ్డాడు.

నేను ఎక్కబోతుంటే, "పంతులుగారూ, ఒక్కమాట. రేపుఎలెక్షన్లలో తమ ఏపార్టీ?" అన్నాడు.

"ఎందుకేమిటి ?" అన్నాను.

"ఈ దెబ్బలో మనం వెనక అనుకున్న పని జరిగే తీరుతుంది." అన్నాడు.

"ఏమిటి ఆ పని?"

"మనకి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం వచ్చి తీరుతుంది. రాజాజీకూడా తప్పుకున్నాడుగా. ఇహ సెలవు. నమస్కారం" అని, తిరిగి చెవిలో, "ఒక్క కార్డు వ్రాయించాలి. కేరాఫ్ విశ్వేశ్వరస్వామి ఆలయం అంటే చాలు. ఇదే మన పెర్మనెంటు మకాం."

"దేనివిషయం వ్రాయమన్నావు?"

"పాతబైసికి లెక్కడైనా ఉంటే"

కారు వెళ్లిపోయింది.

